క్లుప్తంగా

సాహితీవేత్తకు శ్రీ పడవల లక్ష్మణస్వామి పురస్కారం

ఒంగోలు మెట్రో: ఒంగోలుకు చెందిన ప్రముఖ సాహితీవేత్త, కవి, ఆంధ్రోపన్యాసకుడు, కళామిత్రమండలి (తెలుగులోగిలి) సంస్థ, ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్యల అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు చేస్తున్న సాహిత్య కృషిని గుర్తించి శ్రీ పడవల లక్ష్మణస్వామి స్మారక స్ఫూర్తి పురస్కారం–2024కు ఎంపిక చేశారు. ఆ మేరకు సహజ సాహితీ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు వడలి రాధాకృష్ణ, పురస్కార ప్రదాత పీవీఆర్ ప్రసాదు ఒక ప్రకటనలో తెలిపారు. పురస్కారాన్ని, నగదు బహుమతిని ఈ నెల 22వ తేదీ చీరాల రోటరీ క్లబ్ సమావేశ మందిరంలో జరిగే సాహిత్య సభలో ప్రముఖుల చేతుల మీదుగా ప్రదానం చేస్తారని నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, కళామిత్ర మండలి ప్రధాన కార్యదర్శి సింహాద్రి జ్యోతిర్మయి వెల్లడించారు. ఈ సందర్భంగా అంకమ్మరావును పలువురు అభినందించారు.

కనపర్తి ఎత్తిపోతల పథకానికి నీరు విడుదల

నాగులుప్పలపాడు: కనపర్తి ఎత్తిపోతల పథకానికి నీరు విడుదల చేయడం వలన ఈ ప్రాంతంలో 5 వేల ఎకరాల్లో పంటల సాగుకు అవకాశం కలుగుతుందని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం కనపర్తి ఎత్తిపోతల పథకం వద్ద మోటార్లను ప్రారంభించి కాలువకు నీరు విడుదల చేశారు. పారుదల నీటికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కనపర్తి ఎత్తిపోతల పథకం పరిధిలోని సుమారు 5 వేల ఎకరాల్లో పంటలు పండించడానికి ఈ పథకం చాలా ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో ఎత్తిపోతల పథకం సంఘ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

రోగులకు అన్నదానం

ఒంగోలు సెంట్రల్: రాష్ట్ర వైద్యారోగ్య శాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఒంగోలు జీజీహెచ్‌లో సత్యన్నసేన ఆధ్వర్యంలో శివాజీ యాదవ్, శ్రీహరి యాదవ్ సమక్షంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి 600 మంది రోగులకు, సహాయకులకు అన్నదానం చేశారు. జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్, ఆర్ఎంఓ డాక్టర్ చెంచయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, టి.సురేష్ యాదవ్, దండు శ్రీను, డాక్టర్ ఉబ్బా, నేతాజీ, రాజశేఖర్ పాల్గొన్నారు.

మార్కాపురం డీఎస్పీగా నాగరాజు



డీఎస్పీ నాగరాజుతో సీఐలు, ఎస్సైలు

మార్కాపురం: మార్కాపురం డీఎస్పీగా యు.నాగరాజు సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో లా అండ్ ఆర్డర్ విషయంలో రాజీ పడేది లేదని, సత్వర న్యాయం అందిస్తామన్నారు. సీఐ సుబ్బారావు, ఎస్సైలు సైదుబాబు, అంకమరావు తదితరులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

50 మద్యం బాటిళ్లు స్వాధీనం



క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఎస్సై కోటేశ్వరరావు

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామంలో అక్రమంగా మద్యం క్వార్టర్ బాటిళ్లను తరలించి గుట్టు చప్పుడు కాకుండా అమ్మకాలు చేస్తున్న బొజ్జా భాస్కర్ అనే వ్యక్తిని ఎస్సై పి.కోటేశ్వరరావు రాచర్లఫాం వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతని దగ్గర అమ్మకానికి సిద్ధంగా ఉన్న 50 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.


శ్రీనగర్‌కాలనీలో విజయ గణపతి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


గణపతి కళ్యాణంలో పాల్గొన్న భక్తులు


నాగులుప్పలపాడు: నిమజ్జనానికి తరలుతున్న శ్రీకృష్ణ యూత్ గణనాథుడు

భక్తిశ్రద్ధలతో గణపతికి శాంతి కళ్యాణం

ఒంగోలు మెట్రో:

నగరంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా స్థానిక శ్రీనగర్‌కాలనీ మొదటి లైనులో విజయ గణపతి, మద్దిరాలపాడు సిద్ధిబుద్ధి సమేత విజయ గణపతికి సోమవారం ఉదయం పది గంటలకు వేద పురోహితుల మంత్రోచ్చారణల మధ్య సామూహిక శాంతి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. తొలుత విష్వక్సేన ఆరాధన, శుద్ధి పుణ్యాహవాచనం, అంకురార్పణ, రక్షా సూత్రధారణ, స్వామి, అమ్మవార్లకు పాదప్రక్షాళన, జలధారణ, మహాసంకల్పం, మాంగల్య పూజ, మాంగల్య ధారణ, మహా మంగళ నీరాజనాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం పన్నెండు గంటలకు అన్న సమారాధన కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల కళ్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా వినాయకచవితి సందర్భంగా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను అట్టహాసంగా ఊరేగించి నిమజ్జనానికి తరలించారు.

నాగులుప్పలపాడు మండలంలో ఘనంగా నిమజ్జనాలు...

నాగులుప్పలపాడు: నవరాత్రి ఉత్సవాల్లో భక్తులచే పూజలందుకున్న గణనాథులు సోమవారం పెద్ద ఎత్తున నిమజ్జనాలకు తరలారు. శ్రీ కృష్ణ యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మద్దిసాని బుల్లెట్ యూత్ గణనాథుడు భక్తులచే పూజలందుకున్న అనంతరం యువత కేరింతల నడుమ పెదగంజాం సముద్రతీరానికి నిమజ్జనానికి తరలివెళ్లాడు. ఒమ్మెవరం గ్రామంలో 26 ఏళ్లుగా వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. ఈ ఏడాది ఏర్పాటు చేసిన విగ్రహాన్ని సోమవారం ఘనంగా నిమజ్జనానికి తరలించారు. ఉప్పుగుండూరు గ్రామం పార్కులో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను వ్యాపారవేత్త కొంజేటి సురేష్ వేలంలో దక్కించుకున్నారు. అనంతరం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించి ఉప్పుగుండూరు ఊరచెరువులో నిమజ్జనం చేశారు.

కొత్తపట్నం సముద్రతీరంలో...

కొత్తపట్నం: ఓ బొజ్జ గణపయ్య.. నీకింక సెలవయ్యా... అంటూ భక్తులు గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. సోమవారంతో విగ్రహాల నిమజ్జనాలు దాదాపు పూర్తయ్యాయి. ఈ నెల 7వ తేదీ వినాయకచవితి సందర్భంగా వాడవాడలా గణపతి విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు. రెండోరోజు, మూడోరోజు నుంచే విగ్రహాలను కోలాహలంగా ఊరేగించి నిమజ్జనాలు చేయడం ప్రారంభించారు. పది రోజుల నుంచి కొత్తపట్నం, మడనూరు, ఈతముక్కల బీచ్‌లలో మొత్తం 1,049 విగ్రహాలను నిమజ్జనం చేశారు. సోమవారం పదో రోజు భారీ విగ్రహాలు రావడంతో నిమజ్జనాలు చేయడం అతికష్టంగా సాగింది. ట్రాక్టర్ల సహాయంతో నిమజ్జనాలు పూర్తి చేశారు. పది రోజుల పాటు ఎటువంటి ప్రాణ నష్టం లేకుండా పోలీసులు, మెరైన్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అనారోగ్యంగా ఉన్న భక్తులకు కొత్తపట్నం ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి ప్రథమ చికిత్స అందించారు.


మంగమూరురోడ్డు కొత్తడొంక నుంచి నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహం


నాగులుప్పలపాడు: నిమజ్జన కార్యక్రమంలో యువత కేరింతలు


కర్నూలు రోడ్డు లక్కీ షాపింగ్ మాల్ వద్ద నిమజ్జన ఊరేగింపులో భారీగా పాల్గొన్న భక్తులు


నాగులుప్పలపాడు: దక్షిణం బజారు వినాయకుడు


ఒంగోలు మారుతీనగర్ వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు


వినాయక విగ్రహాన్ని సముద్రంలో నిమజ్జనం చేస్తున్న భక్తులు



భారీ విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు

రోటరీ అంటే సేవ

చీమకుర్తి (మద్దిపాడు): రోటరీ అంటే సేవ.. రోటరీ అంటే స్నేహం అని డిస్ట్రిక్ట్ రోటరీ క్లబ్ గవర్నర్ శరత్ చౌదరి అన్నారు. చీమకుర్తి రోటరీ క్లబ్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ ప్రపంచ దేశాలలో పలు సేవలు అందిస్తున్న తీరుకు ప్రశంసలు అందుతున్నాయని తెలిపారు. ఆ స్ఫూర్తితోనే రోటరీ క్లబ్ పనిచేస్తోందన్నారు. చీమకుర్తి రోటరీ క్లబ్ చిన్నది అయినా గత 12 సంవత్సరాలలో కూరగాయల మార్కెట్, బస్ షెల్టర్, మహాప్రస్థానాలను నిర్మించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం రోటరీక్లబ్ ఆత్మీయ సమావేశాన్ని కడవా రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించగా, సెక్రటరీ సుధాకర్ సమన్వయకర్తగా వ్యవహరించి గత మూడు నెలలుగా క్లబ్ నిర్వహించిన కార్యక్రమాల గురించి తెలిపారు. గవర్నర్ చేతుల మీదుగా మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మైక్ సెట్ అందించారు. ముందుగా క్లబ్ గవర్నర్ తూర్పుబజారులోని గణేశ్ విగ్రహం వద్ద పూజలు చేయగా, రోటరీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చెరుకూరి రఘుకిరణ్, పీ శ్రీనివాసమూర్తి, తూర్పుబజార్ యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రోటరీ సీనియర్ సభ్యులు అంబటి వీరారెడ్డి, వెంకట్రావు, నాగరాజు, అడుసుమిల్లి శ్రీనివాసరావు, రామబ్రహ్మం, తిరువెంగళం, రామకృష్ణారెడ్డి, గొల్లపూడి చౌదరి, రోటరీ మిత్రబృందం హాజరయ్యారు.



మహాప్రస్థానాన్ని సందర్శిస్తున్న రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్‌చౌదరి, క్లబ్ సభ్యులు

ఆటోలో మర్చిపోయిన బ్యాగు పోలీసులకు అందజేత

ఒంగోలు టౌన్: నిజాయితీపరుడైన ఒక ఆటోడ్రైవర్ తన ఆటోలో ప్రయాణించిన వారు మర్చిపోయి వదిలేసి వెళ్లిన బ్యాగును పోలీసులకు అప్పగించిన ఘటన సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... నగరంలోని కేశవస్వామిపేటకు చెందిన మిందల లలితసాయి విక్రమ్ సింహపురి రైల్లో నెల్లూరు నుంచి ఒంగోలు వచ్చారు. ఇంటికి వెళ్లేందుకు రైల్వేస్టేషన్ వద్ద ఆటో ఎక్కి జక్రయ్య హాస్పిటల్ వద్ద దిగారు. ఆ సమయంలో ఆటోలో బ్యాగ్ మర్చిపోయారు. కాసేపటి తర్వాత ఆటోలో బ్యాగ్ ఉండటం చూసిన ఆటో డ్రైవర్ మేకల ప్రసాద్ టూటౌన్ పోలీసుస్టేషన్‌లో సీఐ మేడా శ్రీనివాసరావుకు అప్పగించారు. బ్యాగ్ పోగొట్టుకున్న మహిళ వివరాలు తెలుసుకున్న సీఐ ఆమెకు సమాచారం అందించారు. వెంటనే స్టేషన్‌కు చేరుకున్న బాధితురాలు లలితసాయి బ్యాగ్ తెరిచి చూసి అందులో బంగారు నగలన్నీ సక్రమంగా ఉన్నట్లు చెప్పారు. పోలీసుల సమక్షంలో ఆమెకు బ్యాగు అందజేశారు. ఆటో డ్రైవర్ మేకల ప్రసాద్‌ను సీఐ అభినందించారు. బాధితురాలు సీఐ, ఆటోడ్రైవర్‌కు ధన్యవాదాలు తెలిపారు.


పోలీసుల సమక్షంలో బాధితురాలికి బ్యాగ్ అందజేస్తున్న ఆటోడ్రైవర్

పంట పొలాల్లో అడవి పందుల విధ్వంసం

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలో పొలాలపై అడవి పందులు మూకుమ్మడిగా విధ్వంసం చేస్తున్నాయి. ఆ సమయంలో అడ్డు వచ్చిన రైతులపై కూడా దాడులకు దిగుతున్నాయి. ఇప్పటి వరకు తెగుళ్లతో రైతులు పోరాడి అలిసిపోయారు. మళ్లీ అడవి పందులు పంటలపై దాడులు చేస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. పశ్చిమ ప్రకాశంలో పంటలపై అడవి పందుల దాడితో రైతులు పంటలను కాపాడుకునేందుకు రాత్రి పూట పొలాల్లోనే నిద్రపోతున్నారు. కంటి మీద నిద్ర లేకుండా పంటలు కాపాడుకుంటున్నారు. వర్షాభావంతో పంటలు ఎండిపోతున్న దశలో పైపులు వేసుకుని పంటలను కాపాడుకునేందుకు రైతులు ఓ వైపు శ్రమిస్తుండగా మరో వైపు చేతికి వచ్చే పంటను అడవి పందులు రాత్రి పూట గుంపులుగా పొలాలపై దాడి చేసి నాశనం చేస్తున్నాయి. పందుల బారి నుంచి కాపాడుకునేందుకు టపాసులు కాల్చుతున్నారు. మార్కాపురం సబ్ డివిజన్‌లో పత్తి, మిర్చి, కంది, వరి సాగు చేశారు. గిద్దలూరు నుంచి పుల్లలచెరువు వరకు ఉన్న గ్రామాల్లో పంటలపై అడవి పందులు దాడి చేస్తున్నాయి. పత్తి, కంది, మిర్చి పైర్లను తొక్కేస్తున్నాయి. దీంతో అడవి పందుల దాడితో రైతులు నష్టపోతున్నారు. రైతులపై దాడులు చేస్తున్నాయి. ఇటీవల పెద్దదోర్నాల మండలం కొత్తూరులో ఈ నెల 12న పశుగ్రాసం కోసం వెళ్లిన రైతు యరామిరెడ్డిపై అడవి పంది దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మార్కాపురం మండలం నాగులవరం, వేములకోట, బోడపాడు, దరిమడుగు, ఇడుపూరు, గొట్టిపడియ, జమ్మనపల్లి, ఎల్‌బీఎస్‌నగర్, నికరంపల్లి, కోలభీమునిపాడు, పెద్దారవీడు మండలం కలనూతల, పుచ్చకాయలపల్లె, సుంకేసుల, గుండంచర్ల, బద్వీడు చెర్లోపల్లె, కొత్తపల్లె, దోర్నాల మండలం బొమ్మలాపురం, గంటవానిపల్లె, కొత్తూరు, యడవల్లి, గంటవానిపల్లె, నల్లగుంట్ల, యర్రగొండపాలెం మండలం కొత్తూరు, గంజివారిపల్లె, పందివానిపల్లె, అమానిగుడిపాడు, బోయలపల్లి, గుర్రపుసాల, కొలుకుల, పుల్లలచెరువు మండలం వెంకటరెడ్డిపల్లె, ముటుకుల, మర్రివేముల, శతకోడు, తర్లుపాడు మండలం నాయుడుపల్లె, శీతానాగులవరం, తాడివారిపల్లె, నాగెళ్లముడుపు, మీర్జాపేట, సూరేపల్లె, అర్ధవీడు మండలం గన్నేపల్లి, కాకర్ల, రంగాపురం, యాచవరం, వెలగలపాయ, పాపినేనిపల్లె, దొనకొండ, బేస్తవారిపేట మండలం పందిళ్లపల్లి, గలిజేరుగుళ్ల, పెద్దఓబినేనిపల్లె పూసలపాడు, రాచర్ల మండలం పలుగుంటిపల్లె, అనుములపల్లె, జె.పుల్లలచెరువు తదితర గ్రామాల్లో అడవి పందుల బెడద ఎక్కువగా ఉంది. పంటలను కాపాడుకునేందుకు రైతులు పొలాల్లోనే మంచె కట్టుకుని తెల్లవార్లూ జాగారం చేస్తూ పంటలను కాపాడుకుంటున్నారు. విద్యుత్ కంచె ఏర్పాటు చేసుకుందామనుకుంటే రాత్రి పూట తామే నీరు కట్టుకునేందుకు తిరుగుతుంటామని, దీంతో ఏం చేయాలో అర్థం కావటం లేదని వేములకోట గ్రామానికి చెందిన రైతులు జానపాటి ఆవులయ్య, టి.రామిరెడ్డిలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు జరిగి పంట నష్టపోతే ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుందని, అడవి పందుల దాడితో ఎలాంటి పరిహారం ఇవ్వటం లేదని తెలిపారు. అటవీశాఖ, వ్యవసాయ శాఖాధికారులు అడవి పందుల నివారణకు తమకు సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి ఆరుకాలం కష్టించి పంటలు పండిస్తే అడవి పందుల నోట్లో పడి దిగుబడులు రాకుండా పోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు వర్షాలు పడక పంటలు ఎండిపోతుండగా మరో వైపు ఉన్న పంటలను అడవి పందులు నాశనం చేయడంతో రైతులు నిరాశ, నిస్పృహలతో ఉన్నారు.


పొలాల్లో తిరుగుతున్న అడవి పంది

బ్రెయిన్ ట్యూమర్ చిన్నారికి చేయూత

ఒంగోలు సెంట్రల్: బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న చిన్నారికి సూర్యశ్రీ ట్రస్ట్ చేయూతనిచ్చింది. హైదరాబాద్‌కు చెందిన చిన్నారి మిథున్ బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నాడు. బాలుని తండ్రి మృతి చెందడంతో కుటుంబ పోషణ నిమిత్తం తల్లి ఒక ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. కుమారుడికి బ్రెయిన్ ట్యూమర్ అని తెలియగానే దిగ్భ్రాంతి చెందిన స్థితిలో సూర్యశ్రీ ట్రస్ట్ ఫౌండర్ మండవ మురళీకృష్ణను సహాయం కోరింది. చిన్నారికి ట్రస్ట్ చైర్మన్ కె.సర్దార్ ద్వారా ఎన్ఆర్ఐ మండల మురళీకృష్ణ రూ.1.50 లక్షల ఆర్థిక సహాయం అందించారు. ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న ట్రస్ట్ బాధ్యులు

ఉప్పుగుండూరు విద్యార్థినికి మెడికల్ ఫ్రీ సీటు

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు విద్యార్థినికి మెడికల్ ఫ్రీ సీటు దక్కింది. ఆదివారం రాత్రి ప్రకటించిన మెడికల్ సీట్లలో ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన మున్నంగి సుమకు గుంటూరు మెడికల్ కళాశాలలో ఫ్రీ సీటు లభించింది. నిరుపేద కుటుంబానికి చెందిన సుమ 1 నుంచి 5వ తరగతి వరకు గ్రామంలోని సత్రం పాఠశాలలో, 6 నుంచి 10వ తరగతి వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి 592 మార్కులు సాధించింది. అనంతరం బీఆర్ అంబేడ్కర్ గురుకుల సాంఘిక సంక్షేమ శాఖ వారు నిర్వహించే పరీక్షలో నెగ్గి విజయవాడ ఈడ్పుగల్లులో ఇంటర్ పూర్తి చేసింది. నీట్ పరీక్షలో ఆలిండియా 594వ ర్యాంకు సాధించి ఎంబీబీఎస్‌లో సీటు పొందింది. నిరుపేద కుటుంబంలో పుట్టి మెడికల్ సీటు సాధించడంపై తల్లిదండ్రులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.


మున్నంగి సుమ

నైతికతే నిజమైన స్వేచ్ఛ


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మహిళా నేతలు

మార్కాపురం: నైతికతే నిజమైన స్వేచ్ఛ అని జమాతే ఇస్లామీ హింద్ జిల్లా కార్యదర్శి తబస్సుమ్ అన్నారు. జేఐహెచ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రెస్‌క్లబ్‌లో నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే నినాదంతో వాల్‌పోస్టర్లు, పాంప్లెట్స్‌ను విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో మితిమీరిన స్వేచ్ఛ పేరుతో చోటుచేసుకుంటున్న పరిణామాలు, మహిళలపై చెడు ప్రభావం చూపుతున్నాయన్నారు. నిజమైన స్వేచ్ఛ కేవలం నైతికతతోనే సాధ్యమనే వాస్తవాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఒక సర్వే ప్రకారం దేశంలో రోజూ 90 అత్యాచార కేసులు నమోదు కావడం ఆందోళన కలిగించే విషయమన్నారు. నైతికతపై కళాశాల స్థాయిలో వ్యాస రచన, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘ నాయకులు సాహేదా, సుమయ, అమీనా, ఆసీఫా, ఆయేషా పాల్గొన్నారు.

స్విమ్మర్ శ్రీనివాస్‌కు సన్మానం

పొదిలి: మండలానికి చెందిన గోపనబోయిన శ్రీనివాస్ ఇటీవల నేపాల్లో జరిగిన అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్స్ సాధించాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా ఆర్య వైశ్య సంఘ మాజీ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మాధవి దంపతులు శ్రీనివాస్‌ను సన్మానించారు. భాస్కర్ స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్‌ను శాలువా, పూలదండలతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. వాసవి క్లబ్ నాయకులు సోమిశెట్టి శ్రీదేవి, సోమిశెట్టి చిరంజీవి, సామి రాజా, మాజీ ఉప సర్పంచ్ షేక్ జిలానీ, షేక్ కమర్, షేక్ సలీం, మండల ఎస్సీ సెల్ నాయకులు ఎద్దు నగేష్ పాల్గొన్నారు.


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న భాస్కర్ దంపతులు

రైలు కిందపడి మృతి చెందిన వ్యక్తిది బేస్తవారిపేట

కంభం: కంభం–జేబీకే పురం మధ్యలో శనివారం రాత్రి రైలుకింద పడి మృతి చెందిన వ్యక్తి బేస్తవారిపేట అంబేద్కర్ కాలనీకి చెందిన ఆర్లగడ్డ అల్లూరయ్య గా గుర్తించినట్లు మార్కాపురం రైల్వే ఏఎస్సై ఎ. వెంకట్రావు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వికలాంగుడని, అనారోగ్యంతో బాధపడుతున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదని, సోషల్ మీడియా, పేపర్లలో చూసి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గుర్తుపట్టారన్నారు. కంభం ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం చేసిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.